క్లుప్తంగా

క్షేమకాళీని దర్శించుకున్న కె.కె.రాజు


క్షేమకాళీ ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కె.కె.రాజు, ఆళ్ల లీలావతి, కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీ మెయిన్ రోడ్ వద్ద శ్రీలక్ష్మీగణేష్ వర్తక సేవా సంఘం, రైల్వే న్యూకాలనీ ఆధ్వర్యంలో క్షేమకాళీ పంచరాత్రి పూజా మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం అమ్మవారిని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు దర్శించుకున్నారు. కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్‌తో కలిసి ఆయన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనను వారు ప్రారంభించారు. పార్టీ నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ శ్లాబ్ పనుల ప్రారంభం


శ్లాబ్ పనులు ప్రారంభిస్తున్న పైడి రమణ

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం పరిధి వైఎస్సార్ నగర్‌లో ఇటీవల శంకుస్థాపన చేసిన జీ ప్లస్ 1 కమ్యూనిటీ హాల్ శ్లాబు పనులను బుధవారం ప్రారంభించారు. కార్పొరేటర్ కంపా హనోకు సూచనలతో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు, రాష్ట్ర ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పైడి రమణ ఈ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించి, పరిశీలించారు.

ఘనంగా మిస్పా ప్రార్థన మందిర వార్షికోత్సవం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కె.కె.రాజు

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు సాయినగర్‌లోని మిస్పా ప్రార్థన మందిరం 55వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు వేడుకలు ప్రారంభించారు. అనంతరం మందిరం పాస్టర్ వై.ఏలియ నేతృత్వంలో మిస్పా ఉజ్జీవ కీర్తనల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. క్రీస్తు సందేశంతో మందిరంలో నిత్యం ప్రభువును స్తుతించడం మనసుకు శాంతి కలుగుతుందని కె.కె.రాజు అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వరరావు, కృష్ణారావు, అమర్ రెడ్డి, చిరంజీవి, ప్రసాద్, కృష్ణ, శ్రీను, దంతు, హరినాథ్, నాగరాజు, క్రైస్తవ పెద్దలు, దైవజనులు పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్ష పవిత్రమైనది


స్వాములకు అన్నప్రసాదం వడ్డిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

సీతంపేట: శ్రీధర్మశాస్త అయ్యప్ప దీక్ష ఎంతో పవిత్రమైనదని, నియమ నిష్టలతో కూడినదని మేయర్ గొలగాని హరివెంకటకుమారి శ్రీనివాస్ అన్నారు. అక్కయ్యపాలెం జాతీయ రహదారి వద్ద పోర్ట్ ఆస్పత్రి సమీపంలో ఎరిమేలి అయ్యప్ప అన్నసమారాధన సేవా ట్రస్టు ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు నిర్వహిస్తున్న అన్నసమారాధనలో ఆమె పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అయ్యప్ప భక్తులకు మండలం పాటు అన్నదానం చేయడం గొప్ప విషయమని ట్రస్టు ప్రతినిధులను అభినందించారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- 43వ వార్డులో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..'


వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరిస్తున్న కె.కె.రాజు


మాట్లాడుతున్న సమన్వయకర్త కె.కె.రాజు, చిత్రంలో ఫ్లోర్ లీడర్ బాణాల, కార్పొరేటర్ ఉషశ్రీ

సీతంపేట: రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు అన్నారు. 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ఆధ్వర్యంలో బుధవారం దాడి రామ్మూర్తి కల్యాణ మండపం వద్ద జగన్నాథపురం సచివాలయం(241) పరిధిలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన సచివాలయం పరిధిలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి పనుల వివరాల బోర్డును, అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు పాలనను, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న సంక్షేమాభివృద్ధి పాలనకు ప్రతి ఒక్కరూ బేరీజు వేసుకోవాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో 600 హామీలను ప్రకటించి ఏ ఒక్కటీ చంద్రబాబు నెరవేర్చలేదని గుర్తుచేశారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, 2024 ఎన్నికల్లో ప్రజలంతా ఆశీర్వదించి మళ్లీ ఆయనను సీఎంను చేయాలని కోరారు. జగనన్న పాలనలో 63 లక్షల మంది పెన్షన్లు పొందుతున్నారన్నారు. నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులను ఆధునికంగా అభివృద్ధి చేసి కార్పొరేట్ స్థాయిలో విద్యను, వైద్యాన్ని ప్రజలకు చేరువ చేశారన్నారు.

ప్రతి కుటుంబానికి మేలు

జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, పార్టీ మండలాధ్యక్షుడు బాణాల శ్రీనివాసరావు మాట్లాడుతూ జగనన్న ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తూచ తప్పకుండా అమలు చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ ఇది ఆలోచించాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రతి కుటుంబానికి మేలు చేస్తున్న జగనన్ననే మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. కార్పొరేటర్ ఉషశ్రీ మాట్లాడుతూ మహిళలంతా సంతోషంగా ఉండాలని జగనన్న సీఎం ఆయ్యాక రుణమాఫీ చేశారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా మహిళల బ్యాంకు ఖాతాలకే జమ చేసి అక్కచెల్లెమ్మల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నారని తెలిపారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించి నాలాంటి వారు ఎందరో పదవులు చేపట్టారన్నారు. మహిళా సాధికారత, మహిళలకు పెద్దపీట వేయడం అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. 241 సచివాలయం పరిధిలో 1,600 మంది లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ద్వారా రూ.21 కోట్ల నగదు బదిలీ జరిగిందని చెప్పారు. ఇంత మేలు చేసిన జగనన్నకు ప్రజల దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఏపీడీ పద్మావతి, జేసీఎస్ మండల కన్వీనర్లు బులుసు జగదీష్, అమర్‌రెడ్డి, 43వ వార్డు నాయకులు భైరవెంకట్, దొప్ప చంద్రకళ, పారుపల్లి రవి, సన్యాసిరావు, వల్లి, ఖాదర్, ఆడారి పద్మ, పద్మి, సీవో ధనలక్ష్మి, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో జీవితానికి పరిపూర్ణత


మాట్లాడుతున్న మెట్రోరైల్ కార్పొరేషన్ ఎండీ రావు

సీతంపేట: గ్రంథాలయం దేవాలయం కంటే గొప్పదని ఆంధ్రప్రదేశ్ మెట్రోరైల్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ యు.జె.ఎం.రావు అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీలో గ్రంథాలయం, గ్రంథ పఠనం అనే అంశంపై కవి సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం వల్ల విద్యతోపాటు విజ్ఞానం, లోకరీతిని చెప్పే రచనల ద్వారా జీవన గమనంలో సమగ్ర పరిపూర్ణత కలుగుతుందన్నారు. తాను ఉన్నతి స్థితిలోకి రావడానికి గ్రంథాలయం ఎంతో దోహదపడిందని చెప్పారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ గ్రంథాలయాలు జ్ఞాన దేవాలయాలని, పుస్తక పఠనం ద్వారా జ్ఞాన సముపార్జన చేయాలన్నారు. డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ గ్రంథాలయాలు అక్షరాల అక్షయపాత్ర అని, మంచిని పెంచే మహిమాన్విత విద్యాలయంగా పేర్కొన్నారు. అనంతరం కవి సమ్మేళనంలో 30 మంది కవులు తమ కవితలు చదివి వినిపించారు. కార్యక్రమంలో సిహెచ్.చిన సూర్యనారాయణ, కె.జి.వేణు, కె.వి.ఎస్.మూర్తి, కొత్తూరి రమణ, సాలిపల్లి మంగామణి, దామరాజు విశాలక్షి, ఎం.విజయగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్

సీతంపేట: సూపర్ స్టార్ కృష్ణ ప్రథమ వర్ధంతి సందర్భంగా సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ డైమండ్ పార్కు ఆధ్వర్యంలో బుధవారం అక్కయ్యపాలెం ప్రియదర్శిని వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలోఅసోసియేషన్ అధ్యక్షుడు మద్ది రాజశేఖర్‌రెడ్డి, కార్యదర్శి నున్న మురళీకృష్ణ, నాని ప్రసాద్, లంక శ్రీనివాస్, పి.రవి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు


బర్మా జంక్షన్ వద్ద సూచిక బోర్డును పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్

మద్రిపాలెం: కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఏడీసీపీ జి.శ్రీనివాసరావు సూచనల మేరకు జాతీయ రహదారిపై తాటిచెట్లపాలెం, బర్మా జంక్షన్, బిర్లా జంక్షన్, పంజాబ్ హోటల్ జంక్షన్, ఆర్ అండ్ బీ కూడలి వద్ద బుధవారం ఉదయం ఫ్లెక్సీ సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ ఏసీపీ జి.రాజీవ్‌కుమార్ వాటిని పరిశీలించారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు సర్వీస్ రోడ్డులో ప్రయాణించాలని, సురక్షితంగా గమ్యాలకు చేరుకోవాలని ఆయన సూచించారు. నిబంధనలు పాటించకుండా హైవేలో ప్రయాణిస్తే రూ.1,035 జరిమానా విధిస్తామని, 40 కిలోమీటర్లకు మించి వేగం ఉండరాదని, స్పీడ్ పెంచితే కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు హెచ్చరించారు. వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని సూచించారు.

'సుజల స్రవంతి'ని పూర్తి చేయండి


మాట్లాడుతున్న రాజుగౌడ్

సీతంపేట: ఏ ప్రాంతమైన అభివృద్ధి చెందాలంటే అక్కడ సాగునీటి వనరులను మెరుగుపర్చి భూమిని సాగులోకి తేవాలని ఉత్తరాంధ్ర ప్రజా పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాజుగౌడ్ యాత అన్నారు. అక్కయ్యపాలెంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగునీటి రంగంలో ఉత్తరాంధ్ర ప్రాంతం పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతోందని, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్మాణంలో జరుగుతున్న జాప్యమే కారణమన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి జాతీయ హోదా కల్పించి వెను వెంటనే నిర్మాణం పూర్తి చేయాలని, లేదంటే 2024 ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు.

27, 28 తేదీల్లో మహాధర్నా



మహాధర్నాపై ప్రచారం చేస్తున్న ఆటో డ్రైవర్లు

సీతంపేట: కార్మిక, రైతాంగాపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో జరగనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు జి.వామన మూర్తి పిలుపునిచ్చారు. నరసింహనగర్ కూడలి వద్ద బుధవారం నిర్వహించిన ఆటో డ్రైవర్ల ప్రచారం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలు, హక్కులను కేంద్రం హరిస్తోందని మండిపడ్డారు. కార్మిక చట్టాలను బడా వ్యాపార సంస్థలకు తాకట్టుపెట్టి కార్మిక వర్గానికి భద్రత లేకుండా చేస్తున్నారన్నారు. కార్మిక, రైతాంగ హక్కులను విస్మరిస్తే ప్రభుత్వాలు తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో రావికృష్ణ, ఎ.మహాలక్ష్మి నాయుడు, కె.శ్రీనివాసరావు, పి.సాయికుమార్, కె.నరసింగరావు, పి.సూర్యారావు, జి.రాజా, ఎం.రమణ, అనిల్, ఎ.అప్పారావు పాల్గొన్నారు.

చిన్నూరులో గ్యార్వీ షరీఫ్ ఉత్సవం

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం చిన్నూరులో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నవాబ్ ఆధ్వర్యంలో జస్ నే గ్యార్వీ షరీఫ్ ఉత్సవం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జేసీఎస్ మండల కన్వీనర్ నీలి రవి, ఎం.సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో క్లరికల్, టెక్నికల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 17న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్) ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపోలో ఫార్మసీస్, వరుణ్ మోటర్స్, శ్రీరామ్ చిట్స్, మూత్తూట్ ఫైనాన్స్, టాటా క్యాపిటల్, దక్కన్ ఫైన్ కెమికల్స్, స్పెక్ట్రమ్ టాలెంట్ మేనేజ్‌మెంట్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 500 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. రిటైల్ ట్రెనింగ్ అసోసియేట్, ఫార్మాసిస్ట్, జూనియర్ ట్రైనీ, డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, ఆఫీస్ అసిస్టెంట్, అకౌంట్స్, అసిస్టెంట్, రికవరీ, క్లర్క్, బ్రాంచ్ ఇన్‌చార్జి, వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్స్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పీజీ, 18–35 ఏళ్ల వయసు గల పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు.

ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆటో ఢీకొని ఓ వ్యక్తికి గాయాలైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. చిన్న ముషిడివాడకు చెందిన కర్రి సింహాచలంనాయుడు అనే వ్యక్తి మంగళవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయలుదేరి మద్రిపాలెం మీదుగా నగరంలోని లోటస్ ఆస్పత్రికి వెళ్తుండగా.. 2.45 గంటలకు ఐటీఐ జంక్షన్ వద్దకు వచ్చేసరికి అదే దారిలో వేగంగా వస్తున్న ఆటో వెనుక నుంచి ఢీకొనడంతో అతడికి గాయాలయ్యాయి. క్షతగాత్రుడు ప్రస్తుతం మద్రిపాలెం వద్ద ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ మూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చట్టాలపై అవగాహనతోనే బాల్యవివాహాలకు బ్రేక్

మహారాణిపేట: చట్టాలపై అవగాహనతోనే బాల్యవివాహాలను అరికట్టగలమని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ పేర్కొన్నా రు. జేసీ అధ్యక్షతన బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత అధికారులతో బాల్యవివాహాల నివారణపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, ఎవరైనా వీటికి పాల్పడినా.. సహకరించినా కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. వివాహ సమయంలో అమ్మాయిలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లుగా పేర్కొంటూ వయసు నిర్ధారణ పత్రాలు ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. దీనిపై అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఫంక్షన్ హాళ్లు, దేవాలయాలు, చర్చిలు, మసీదులు, ఇతర వేదికల వద్ద వివాహ వయసును ధ్రువీకరించే పత్రాలను సమర్పిస్తేనే అక్కడ పెళ్లి చేసేందుకు అనుమతి ఇవ్వాలని చెప్పారు. పెళ్లి వేదికల వద్ద బోర్డులు ఏర్పాటు చేసి బాల్యవివాహాల దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం బాలల హక్కుల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో డీఎల్ఎస్ఏ జిల్లా కార్యదర్శి, న్యాయమూర్తి ఎం.వి.శేషమ్మ, డీఆర్వో కె.మోహన్ కుమార్, డీఎల్డీవో పూర్ణిమాదేవి, ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి, దిశ డీఎస్పీ సిహెచ్.వివేకానంద, డీఈవో చంద్రకళ, ఎన్జీఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

మద్రిపాలెం: ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెంలో నివసిస్తున్న మంగళ స్వప్న(44) అనే మహిళకు 2003లో నరేష్ అనే వ్యక్తితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. గత కొంతకాలంగా వీరి మధ్య మనస్పర్థలు రావడంతో ఇటీవల మూడు నెలల కిందట విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి ఆమె సిద్ధార్థనగర్‌లో నివసిస్తున్న గంగరాజు అనే వ్యక్తి దగ్గర ఉంటుంది. మంగళవారం రాత్రి సుమారు 7.30 గంటల ప్రాంతంలో ఆమె మృతి చెందిందని గంగరాజు తెలంగాణ మెదక్ జిల్లాలో ఉంటున్న స్వప్న తల్లికి ఫోన్ చేసి సమాచారం అందించాడు. ఆమె ఉబ్బసంతో మరణించిందని గంగరాజు తెలిపాడు. దీంతో ఆమె తల్లి బుధవారం కంచరపాలెం పోలీస్ స్టేషన్‌కు వచ్చి తన కుమార్తె మృతిపై అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. గురువారం పోస్ట్‌మార్టం నిర్వహిస్తారని పోలీసులు తెలిపారు. సీఐ ఎస్.సాయి నేతృత్వంలో ఎస్ఐ షేక్ సమీర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి కృషి


కస్తూరినగర్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

కంచరపాలెం: కొండవాలు ప్రాంతాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ తెలిపారు. 46వ వార్డు కైలాసపురం పరిధి మధుసూదన్‌నగర్, కస్తూరినగర్, సూరిబాబునగర్, దుర్గా కైలాసపురం కొండవాలు ప్రాంతాల్లో బుధవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఆయా సచివాలయాల పరిధిలో సుమారు రూ.1.5 కోట్లతో నూతనంగా జరుగుతున్న అభివృద్ధి పనులను జోన్–5 ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. రోడ్లు, డ్రైనేజీలు, మెట్ల మార్గాలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆయన ఆదేశించారు. పనులు సకాలంతో పూర్తయితే కొత్త వాటి నిధుల మంజూరుకు కృషి చేయవచ్చని అధికారులకు సూచించారు. కొండవాలు ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నట్లు కటుమూరి సతీష్ తెలిపారు. పర్యటనలో జోన్–5 ఇంజినీరింగ్ డీఈ భరణికుమార్, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ జాగారపు నరేష్‌కుమార్, కో–ఆప్షన్ సభ్యుడు ఎస్.అప్పారావు, నాయకులు కె.చిన్నా, ఎ.కృష్ణ, జి.అప్పారావు, ఎస్.రామారావు, కె.ఎస్.ఈశ్వరరావు, లావణ్య, బాల నారాయణరెడ్డి, జల్లీ రమణారెడ్డి, వార్డు కార్యదర్శి రమ్యశ్రీ, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

25 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు

- రౌండ్ టేబుల్ ఇండియా ఏరియా 9 చైర్మన్ విక్రాంత్ హనుమంతు


దాతలతో రౌండ్ టేబుల్ ఇండియా ఏరియా 9 ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: గత 25 ఏళ్లుగా రౌండ్ టేబుల్ ఇండియా నిస్వార్థమైన సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యతో స్వేచ్ఛ అనే లక్ష్యంతో పనిచేస్తోందని ఏరియా 9 చైర్మన్ విక్రాంత్ హనుమంతు తెలిపారు. రైల్వే స్టేషన్ రోడ్‌లోని బెస్ట్ వెస్ట్రన్ ప్లస్ తేజ్ వివాన్ హోటల్‌లో బుధవారం సంస్థ 25వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, పేద పిల్లలకు విద్యను అందించడానికి కృషి చేస్తోందని చెప్పారు. సుమారు రూ.437 కోట్ల వ్యయంతో 3,616 ప్రాజెక్టులను చేపట్టిందని, వీటిలో 9.53 మిలియన్ పిల్లలకు ఉపయోగపడేలా 8,665 తరగతి గదులు నిర్మించినట్లు వెల్లడించారు. తమ సంస్థ వారోత్సవాల్లో భాగంగా పిల్లలకు ఎంటర్‌టైన్‌మెంట్, మధ్యాహ్న భోజనం, దాతలకు సత్కారం, రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరం, బీచ్ క్లీనింగ్ వంటి కార్యక్రమాలను ఈ ఏడాది నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సంస్థకు సహాయ సహకారాలు అందించిన దాతలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రౌండ్ టేబుల్ ఏరియా 9 వైస్ చైర్మన్ మక్సూద్ అహ్మద్, ప్రాజెక్ట్ కన్వీనర్ సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

24న 'ఆశ్ర' జాతీయ సదస్సు


ఎంపీ ఎంవీవీ చేతుల మీదుగా సదస్సు పోస్టర్ ఆవిష్కరింపజేస్తున్న ఆశ్ర ప్రతినిధులు

డాబాగార్డెన్స్: భారతదేశంలో అత్యంత ప్రతిష్టాత్మక వినియోగదారుల సంస్థ ఆశ్ర (అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్‌నెస్) 5వ జాతీయ సదస్సు ఈ నెల 24న దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించనున్నట్టు సంస్థ అంతర్జాతీయ అధ్యక్షుడు పాలమరశెట్టి రత్నరాజు తెలిపారు. ఈ మేరకు సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా పాలమరశెట్టి మాట్లాడుతూ సెలబ్రిటీ గెస్ట్‌గా టాలీవుడ్ యాక్టర్ అలీ, భారతదేశ వినియోగదారుల సంఘం కార్యదర్శి రోహిత్‌కుమార్ సింగ్, అమెరికా ఆపరేషన్ హెడ్ హరికృష్ణ, సౌత్ కొరియా ఖనరీసస్ వ్యవస్థాపకుడు హంగ్‌సున్‌యంగ్, బాబూభాయ్, ఆర్ఆర్ టీమ్, ఖంటేయం తదితరులు హాజరు కానున్నారని చెప్పారు. ఆశ్రా మినిస్ట్రీ ఆఫ్ కన్జ్యూమర్ అఫైర్స్ ఆధ్వర్యంలో గుర్తింపు పొందిన సంస్థగా దేశంలో సుమారు వెయ్యికి పైగా ప్రతినిధులతోనూ, చీఫ్ ప్యాట్రన్ సుప్రీం కోర్టు లాయర్ హబీస్ సుల్తాన్ అలీ నేతృత్వంలో దేశంలోని పది రాష్ట్రాల్లో నడుస్తుందన్నారు. జాతీయ స్థాయిలో వినియోగదారులకు అవగాహన కల్పించి వారికి ప్రతిభా అవార్డులు అందజేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఇక్బాల్ తెలిపారు. కార్యక్రమంలో ఈవెంట్ హెడ్ వీరూమామ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


పోటీలో పాల్గొన్న విద్యార్థులు

మురళీనగర్: మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా బుధవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ వై.పద్మజ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా పుస్తకాలను ప్రదర్శించి పాఠకులకు అందుబాటులో ఉంచారు. విశ్రాంత ఉద్యోగి ఎంవీ భాస్కరరావు పుస్తక ప్రదర్శన ప్రారంభించారు. విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. దాని వల్ల కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. గ్రంథాలయాల ప్రాధాన్యంపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలకు మాధవధార పాఠశాలకు చెందిన 70 మంది విద్యార్థులు హాజరయ్యారు. టీచర్ ఎస్.శశికళ పోటీలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో పాఠకులు తిరుమలరావు, ఈశ్వరరావు, రాజు, లక్ష్మి, స్రవంతి, దుర్గమ్మ పాల్గొన్నారు.